సాక్షి నిజామాబాద్

మంగళవారం ; 27 ; మే ; 2025



బస్సుల ఫిట్‌నెస్ బాధ్యత..

స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించాలని, రాష్ట్ర రోడ్డు రవాణా సంయుక్త కమిషనర్ చంద్రశేఖర్‌గౌడ్ అన్నారు.

- 8లో ▸



ఫిర్యాదులను ఎప్పటికప్పుడు..

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36.5 /23.8

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

బల్దియాలో హెల్ప్‌డెస్క్



నిజామాబాద్ సిటీ: మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే నగరవాసుల సౌలభ్యం కోసం కమిషనర్ దిలీప్‌కుమార్ 'హెల్ప్‌డెస్క్' ఏర్పాటు చేయించారు. నిరక్షరాస్యులు, తెలుగు భాష రానివారు, వృద్ధులు తమ సమస్యలను ఎక్కడ చెప్పుకోవాలో కార్పొరేషన్ భవనంలోని ప్రతి అంతస్తులో తిరుగుతుంటారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని కమిషనర్ హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయించి ఇద్దరిని విధుల్లో నియమించారు. అలాగే ఫిర్యాదుల బాక్స్ సైతం ఏర్పాటు చేయించడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆస్పత్రుల్లో ప్రత్యేక బృందాల తనిఖీలు



ఖలీల్‌వాడి: అగ్నిప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రులను ప్రత్యేక బృందం సోమవారం తనిఖీ చేసింది. ప్రుడెన్స్, తక్ష, మెడికవర్ ఆస్పత్రులను తనిఖీ చేసిన అధికారులు కొన్ని లోపాలను గుర్తించారు. అగ్నిప్రమాద నివారణ పరికరాల నిర్వహణ, అత్యవసర నిష్క్రమణ మార్గాల నిర్దిష్టత, సిబ్బందికి అవగాహన లేకపోవడం వంటి లోపాలను గుర్తించి ఆస్పత్రుల నిర్వాహకులకు పలు సూచనలు చేసినట్లు తెలిసింది. తనిఖీల్లో పట్టణ సీఐ శ్రీనివాస్‌రాజు, జిల్లా అగ్నిమాపక అధికారి పరమేశ్వర్, డాక్టర్ అంజన పాల్గొన్నారు. అగ్నిప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రుల్లో భద్రతా చర్యల అమలును పరిశీలించేందుకు ఈ బృందం సంయుక్త తనిఖీ చేపడుతోంది. బృందంలో జిల్లా వైద్యారోగ్య అధికారి, జిల్లా అగ్నిమాపక శాఖ, నిజామాబాద్ పోలీసు శాఖ అధికారులు సభ్యులుగా ఉంటారు.

జిల్లాకు కాయకల్ప బృందం

- నేటి నుంచి సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రుల పరిశీలన

నిజామాబాద్ నాగారం: కేంద్ర ప్రభుత్వం ఇచ్చే కాయకల్ప అవార్డు(ప్రోత్సాహక బహుమతి) కోసం దరఖాస్తు చేసుకున్న ఆస్పత్రులను పరిశీలించేందుకు నేడు కాయకల్ప బృందం జిల్లాకు రానుంది. నేడు డిచ్‌పల్లి సీహెచ్‌సీ, జూన్ 2న ఆర్మూర్ ఏరియా ఆస్పత్రి, జూన్ 3న బోధన్ జిల్లా ఆస్పత్రిని ప్రత్యేక అధికారులు సందర్శించనున్నారు. ఆస్పత్రులో అన్ని రకాల రిజిస్టర్లు, పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతోపాటు రికార్డులు పక్కాగా ఉంటే రాష్ట్రస్థాయిలో రూ. 25లక్షల నిధులు మంజూరు చేయనున్నారు.

రాష్ట్ర అవతరణ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు

- అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలి
- అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్



నిజామాబాద్‌అర్బన్: తెలంగాణ అవతరణ వేడుకల కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ఆయా శాఖల అధికారులతో ఆయన సమీక్షాసమావేశం నిర్వహించారు. జూన్ 2వ తేదీన నగరంలోని పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించనున్న రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి వేడుకలను అట్టహాసంగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా సమగ్ర వివరాలతో జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఆర్డీవో సాయాగౌడ్, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్ర కుమార్, ఏసీపీలు రాజావెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

భయపడొద్దు నిర్లక్ష్యం వద్దు

కరోనా కొత్త వేరియంట్ వ్యాప్తి నేపథ్యంలో వైద్య నిపుణుల సూచన



- దేశంలో వ్యాపిస్తున్న కరోనా జేఎన్ 1
- ఒమిక్రాన్‌లాగే ఇలా వచ్చి అలా వెళ్తుందంటున్న వైద్యులు
- సాధారణంగా వచ్చే జ్వరం, జలుబు, దగ్గు, గొంతునొప్పి దీని లక్షణాలు
- బాధితులకు చికిత్స అందించేందుకు జీజీహెచ్‌లో సర్వం సిద్ధం

నిజామాబాద్‌నాగారం: కరోనా కొత్త వేరియంట్ జేఎన్ 1 వ్యాపిస్తుండడంతో మళ్లీ ఎలాంటి పరిస్థితులను చూడాల్సి వస్తుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. విదేశాల్లో మరణాలు సంభవిస్తుండడం, మన దేశంలోని మహారాష్ట్ర, కేరళ, ఢిల్లీ రాష్ట్రాల్లో వందల సంఖ్యలో, కర్నాటక, తమిళనాడు తదితర రాష్ట్రాల్లో పదుల సంఖ్యలో కరోనా కేసులు ఇప్పటికే నమోదయ్యాయి. అయితే వైద్య నిపుణులు మాత్రం కరోనాకు భయపడొద్దని.. అదే సమయంలో నిర్లక్ష్యం పనికిరాదని సూచిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ముఖ్యంగా తెలంగాణలో అంతగా వైరస్ ప్రభావం లేదని, గతంలో వచ్చిన ఒమిక్రాన్ వేరియంట్ లాగే ఇలా వచ్చి అలా వెళ్తుందని తేల్చిచెబుతున్నారు. అయినప్పటికీ జిల్లా యంత్రాంగం మాత్రం కరోనా వ్యాపిస్తే బాధితులకు చికిత్స అందించేందుకు జిల్లా కేంద్రంలోని జీజీహెచ్‌లో తగిన ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకోసం వార్డులను ఏర్పాటు చేసింది.

జేఎన్-1 లక్షణాలు..

- తీవ్రమైన జ్వరం, జలుబు, దగ్గు, గొంతునొప్పి, బలహీనత తదితర లక్షణాలు ఉంటే వెంటనే ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కరోనా టెస్ట్ చేయించుకోవాలి. ఒకవేళ పాజిటివ్ వస్తే అక్కడే అడ్మిట్‌చేసుకొని ప్రత్యేక చికిత్స అందించనున్నారు. ఇంటి వద్ద వారం రోజుల పాటు ఉండి జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుంది.

జీజీహెచ్‌లో ప్రత్యేక వార్డు



కరోనా కొత్త వేరియంట్ వ్యాపిస్తున్న నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని జీజీహెచ్‌లో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశారు. 10 మేల్, 10 ఫిమేల్(ఆడ) వారి కోసం బెడ్‌లు, ఆక్సిజన్, వెంటిలేటర్ ఏర్పాటు చేశారు. కరోనా లక్షణాలు ఉన్నవారు జీజీహెచ్‌కు వస్తే వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- ప్రతి ఒక్కరూ మాస్క్‌లు ధరించాలి
- భౌతిక దూరం పాటించాలి
- చేతులను శానిటైజర్‌తో కడుక్కోవాలి
- నాణ్యమైన ఆహారం తీసుకోవాలి
- తాజా పండ్లు, కూరగాయలు తినాలి

ఇది నాలుగో దశ..



ప్రస్తుతం దేశంలోని పలు రాష్ట్రాల్లో కరోనా జేఎన్-1 వేరియంట్ వ్యాపిస్తోంది. గతంలో వచ్చిన ఒమిక్రాన్ మాదిరిగానే ఉంటుంది. కరోనా 8 దశలు ఉంటుంది. ప్రస్తుతం నాలుగో దశ నడుస్తోంది. కరోనాకు భయపడాల్సిన అవసరం లేదు. చిన్నపాటి జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుంది.

– జే తిరుపతిరావు, మెడికల్ కళాశాల ప్రొఫెసర్

చికిత్సకు ఏర్పాట్లు



కరోనా వ్యాపిస్తే బాధితులకు చికిత్స అందించేందుకు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో అన్ని ఏర్పాట్లు చేశాం. కరోనా పాజిటివ్ అని తెలితే అడ్మిట్ చేసుకొని చికిత్స అందించడం జరుగుతుంది. బెడ్లు, ఆక్సిజన్, వెంటిలేటర్లను సిద్ధంగా ఉంచాం. కరోనా లక్షణాలు ఉన్నవారికి అవసరమైన చికిత్స అందిస్తాం.

– డాక్టర్ శ్రీనివాస్, జీజీహెచ్ సూపరింటెండెంట్

కేసులు నమోదు కాలేదు



జిల్లాలో కొత్త వేరియంట్ కరోనా కేసులు ఎక్కడా నమోదు కాలేదు. జలుబు, జ్వరం, దగ్గు, గొంతు నొప్పి ఉంటే కాస్త జాగ్రత్తగా ఉండాలి. మాస్కులు పెట్టుకొని, భౌతిక దూరం పాటించాలి. కరోనా కిట్లు అందుబాటులో ఉన్నాయి. – రాజశ్రీ, డీఎంహెచ్‌వో

మహాభయం

- పొరుగున ఉన్న మహారాష్ట్రలో 200 పైగా కరోనా కేసులు
- ప్రతిరోజూ వేల సంఖ్యలో ప్రయాణికుల రాకపోకలు



జిల్లా కేంద్రం నుంచి ప్రైవేటు బస్సులో మహారాష్ట్రకు వెళ్తున్న ప్రయాణికులు (ఫైల్)

ఆర్మూర్: కరోనా మళ్లీ వ్యాపిస్తుండడం, పొరుగునే ఉన్న మహారాష్ట్రలో ఇప్పటికే 200కు పైగా కేసులు నమోదుకావడంతో జిల్లా వాసులు ఆందోళన చెందుతున్నారు. సరిహద్దులోనే ఉన్న మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాలకు జిల్లా నుంచి ప్రతిరోజూ వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఆ రాష్ట్రంలోని నాందెడ్ జిల్లాతోపాటు ముంబై, పుణే, నాగ్‌పూర్ వంటి నగరాలకు వివిధ పనుల నిమిత్తం ఎంతో మంది వెళ్తుంటారు. దీంతో జిల్లాలో కరోనా వ్యాప్తికి ఎక్కువ సమయం పట్టకపోవచ్చని పలువురు అంటున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు ఒక్క కేసూ నమోదుకానప్పటికీ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచనల మేరకు డీఎంహెచ్‌వో రాజశ్రీ జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది.

ప్రతి ఒక్కరిలో రోగనిరోధక శక్తి



ఐదేళ్ల సుదీర్ఘ కాలంలో ప్రతి ఒక్కరిలో రోగ నిరోధక శక్తి పెరిగింది. కాబట్టి కరోనాను సులభంగా నియంత్రించొచ్చు. కానీ సోషల్ డిస్టెన్స్ పాటించడంతోపాటు మాస్క్‌లు ధరించాలి. అలాగే జలుబు, దగ్గు వంటివాటి బారిన పడిన వారు ఐసోలేట్ కావాలి. 2019–20లో ఉన్న తీవ్రత ప్రస్తుత వేరియంట్‌లో ఉండకపోవచ్చు.

– డాక్టర్ అశోక్, డిస్ట్రిక్ట్ ఇమ్యూనైజేషన్ ఆఫీసర్, నిజామాబాద్

కాంగ్రెస్‌లో ఉత్కంఠ



- ఢిల్లీలో పార్టీ అధిష్టానంతో సీఎం, పీసీసీ అధ్యక్షుడి వరుస భేటీల నేపథ్యంలో..
- పీసీసీ కార్యవర్గంలో ఎవరెవరికి ఏఏ పదవులో..లెక్కలేసుకుంటున్న శ్రేణులు
- స్థానిక ఎన్నికలు, నామినేటెడ్ పదవుల కేటాయింపులో ఆలస్యం.. నాయకుల్లో డైలమా
- కేబినెట్ బెర్త్‌పైనా ఆసక్తి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఢిల్లీలో కాంగ్రెస్ అధినాయకత్వంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ల వరుస భేటీల నేపథ్యంలో పీసీసీ కార్యవర్గం ప్రకటన ఎప్పుడైనా ప్రకటించవచ్చనే చర్చ జిల్లా రాజకీయ వర్గాల్లో నడుస్తోంది. జిల్లా నుంచి పీసీసీ కార్యవర్గంలోకి ఎవరెవరిని తీసుకుంటారనే విషయమై పార్టీ నాయకుల్లో ఉత్కంఠ నెలకొంది. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ జిల్లా నుంచే ఉండడంతో పీసీసీ కార్యవర్గం కూర్పు విషయమై ఆసక్తి నెలకొంది. ముఖ్యమైన నాయకులు పీసీసీ పదవుల కంటే జిల్లా అధ్యక్ష పీఠంపైనే గురి పెట్టారు. కొందరు సీనియర్ నాయకులు పార్టీ పదవుల కన్నా నామినేటెడ్ పదవులు తీసుకునేందుకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ పదవులు, నామినేటెడ్ పదవుల పందేరంపై అన్నివర్గాల్లో చర్చించుకుంటున్నారు.

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిగా మీనాక్షి నటరాజన్ మాత్రం సంస్థాగత పటిష్టతపై కచ్చితత్వంతో వ్యవహరిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పటికీ ప్రజాప్రతినిధుల కంటే పార్టీ పదవులు నిర్వహించేవారికే ప్రాధాన్యం ఉంటుందని మీనాక్షి నటరాజన్ ప్రకటించడం గమనార్హం. పైగా డీసీసీ అధ్యక్షులకు మరింత ప్రాధాన్యం ఉంటుందని చెప్పడంతో ఈ పీఠం కోసం పోటీ పెరుగుతోంది. జిల్లాకు చెందిన సీనియర్లలో పలువురికి రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ల పదవులు దక్కాయి. మరికొందరు సీనియర్ నాయకులు సైతం రాష్ట్ర కార్పొరేషన్ పదవుల కోసం గట్టిగా పట్టుబడుతున్నారు. మరోవైపు జిల్లా ప్రజాపరిషత్, నగర మేయర్ పీఠాల రిజర్వేషన్లు ఎలా వస్తాయో అంశంపై లెక్కలేసుకుంటున్న తరుణంలో పార్టీ పదవుల పందేరం రావడంతో ఎటువైపు వెళ్లాలో కూడా కొందరు సీనియర్ నాయకులు తేల్చుకోలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో కీలకమైన డీసీసీ పీఠం రేసులోనూ కొనసాగుతున్నారు. ప్రస్తుతం డీసీసీ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న మానాల మోహన్‌రెడ్డి రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్‌గా నామినేటెడ్ పదవి దక్కించుకున్నారు. అయితే రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పదవి రేసులో ఉన్న బాడ్సి శేఖర్‌గౌడ్ డీసీసీ రేసులోనూ ఉన్నారు. అదేవిధంగా సీనియర్ నాయకుడు మార చంద్రమోహన్, ముఖ్యమంత్రి అనుచరుడు బాస వేణుగోపాల్‌యాదవ్, పీసీసీ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన కాటిపల్లి నగేశ్‌రెడ్డి సైతం డీసీసీ రేసులో ముందున్నారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ మునిపల్లి సాయిరెడ్డి సైతం డీసీసీ పీఠం ఆశిస్తున్నారు. అయితే సామాజిక సమీకరణాల నేపథ్యంలో డీసీసీ పీఠాన్ని బీసీలకిస్తారా, ఓసీలకిస్తారా అంశంపై ఆసక్తి నెలకొంది. మైనారిటీ వర్గానికి చెందిన సయ్యద్ ఖైసర్‌కు సైతం పార్టీలో కీలక పదవి దక్కనున్నట్లు తెలుస్తోంది.

- ఢిల్లీలో పార్టీ పదవులు, నామినేటెడ్ పదవుల కసరత్తు జరుగుతున్న నేపథ్యంలో కీలకమైన మంత్రివర్గ విస్తరణపై సైతం పార్టీ నాయకత్వం చర్చిస్తోంది. ఈ క్రమంలో జిల్లా నుంచి మంత్రివర్గంలోకి కచ్చితంగా వెళ్లే అవకాశమున్న బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డికి ఏ శాఖ కేటాయిస్తారనే విషయమై పార్టీ శ్రేణుల్లో ఆసక్తి నెలకొంది.

టీబీ నిర్ధారణ సర్వేకు సహకరించాలి

- వైద్యారోగ్యశాఖాధికారిణి బి రాజశ్రీ



క్షయ నిర్ధారణ సర్వే కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో రాజశ్రీ

నిజామాబాద్‌నాగారం: టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా క్షయ నిర్ధారణ సర్వే నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖాధికారిణి బి రాజశ్రీ తెలిపారు. ఖానాపూర్‌లోని బస్తీ దవాఖానలో సోమవారం సర్వేను డీఎంహెచ్‌వో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈనెల 30వ తేదీ వరకు సర్వే కొనసాగుతుందని, వైద్య సిబ్బందికి ప్రజలు సహకరించాలన్నారు. క్షయ బారినపడే అవకాశాలు ఉన్న మధుమేహం, క్యాన్సర్, రక్తపోటు, గతంలో టీబీ బారిన పడినవారు 60 ఏళ్ల వయస్సు పైబడిన వారు, ఫ్యాక్టరీల్లో పని చేసే, ధూమపానం, మద్యపానం చేసే వారు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధి గ్రస్తుల ఖాతాల్లో ప్రభుత్వం ప్రతినెలా రూ.వెయ్యి చొప్పున ఆరు నెలలపాటు జమ చేస్తుందని, పోషకాహారం తీసుకునేందుకు ఆ డబ్బులను వినియోగించుకోవా లన్నారు. జిల్లా టీబీ నియంత్రణ అధికారిణి దేవినాగేశ్వరి, ఇన్‌చార్జి డిప్యూటీ డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్, డాక్టర్లు అవంతి, ప్రత్యూష, టీబీ కో ఆర్డినేటర్ రవి, హెల్త్ సూపర్‌వైజర్ మధుకర్, సీఎస్‌వో నవీన్, లక్ష్మణ్, నరేశ్, స్రవంతి, భూపాల్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేయర్లు కీలకపాత్ర పోషించాలి

- జిల్లాలో 300 మందికి 50 రోజులపాటు శిక్షణ
- శిక్షణ అనంతరం లైసెన్సుల జారీ
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



శిక్షణ పొందుతున్న యువకుడికి సర్వే కిట్ అందజేస్తున్న కలెక్టర్ హనుమంతు

నిజామాబాద్‌అర్బన్: భూ భారతి చట్టం అమలులో సర్వేయర్లు కీలకపాత్ర పోషించాల్సి ఉంటుందని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అన్నారు. లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకం కోసం ఎంపిక చేసిన వారికి 50 రోజులపాటు శిక్షణ కొనసాగనుంది. శిక్షణ తరగతులను సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టాన్ని అమలు చేస్తోందని, సర్వేయర్ల కొరతను అధిగమించేందుకు ఆసక్తిగల వారిని ఎంపిక చేసి సర్వేయర్లుగా శిక్షణ ఇచ్చి లైసెన్సులు ఇవ్వనుందన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో 300 మంది అర్హులను శిక్షణ కోసం ఎంపిక చేశామన్నారు. సర్వేయర్లు భూ భారతి చట్టంలో పొందుపర్చిన 5, 7, 8 సెక్షన్ ల ప్రకారం భూముల క్రయవిక్రయాలు, సక్సేషన్ వంటి వాటికి సంబంధించి క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టి మ్యాప్‌లను రూపొందించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. లైసెన్స్‌డ్ సర్వేయర్లు సర్వే చేపట్టి భూముల హద్దులు, సమగ్ర వివరాలతో సర్వే మ్యాప్‌లను సమర్పిస్తే, వాటిని ప్రభుత్వ సర్వేయర్లు పరిశీలించి ఆమోదించిన తరువాత పట్టాపాస్ పుస్తకాలకు జతచేయడం జరుగుతుందని తెలిపారు. పట్టాపాస్‌పుస్తకాలు ఉన్న రైతులు సర్వే మ్యాప్ కోసం ప్రభుత్వ గుర్తింపు పొందిన సర్వేయర్లతో సర్వే చేయించుకోవచ్చని సూచించారు. భూధార్ నంబర్ల కేటాయింపునకు లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలు అవసరమవుతాయని పేర్కొన్నారు. ఎలాంటి సందేహాలు ఉన్నా నివృత్తి చేసుకోవాలని శిక్షణ పొందుతున్న వారికి సూచించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి జూలై 28, 29 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వం పరీక్ష నిర్వహిస్తుందని, ఉత్తీర్ణులైన వారికి లైసెన్సులు, గుర్తింపు పత్రాలను జారీ చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ అశోక్, ఇన్‌స్పెక్టర్ కిషన్, సర్వేయర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

ఇందూరు అక్షరలక్ష్మి అభినందనీయం

- రాష్ట్రంలోనే తొలిసారి యాప్ రూపకల్పన
- ఆవిష్కరించిన కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- సంపూర్ణ అక్షరాస్యత సాధన కోసం సమష్టిగా కృషి చేయాలని సూచన



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, పాల్గొన్న అధికారులు

నిజామాబాద్‌అర్బన్: స్వయం సహాయక సంఘాల్లోని సభ్యుల విద్యార్హతలను గుర్తించడంతోపాటు నిరక్షరాస్యులకు చదవడం, రాయడం నేర్పించాలనే సంకల్పంతో 'ఇందూరు అక్షరలక్ష్మి' యాప్ రూపొందించడం అభినందనీయమని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అన్నారు. సంపూర్ణ అక్షరాస్య జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు, సిబ్బంది సమష్టిగా, అంకిత భావంతో కృషి చేయాలని సూచించారు. రాష్ట్రంలోనే తొలిసారిగా సెర్ప్, తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ, సమగ్ర శిక్ష, వయోజన విద్యా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో 'ఇందూరు అక్షరలక్ష్మి' పేరుతో రూపొందించిన యాప్‌ను ఐడీవోసీ కార్యాలయ కాన్ఫరెన్స్‌హాల్‌లో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌తో కలిసి కలెక్టర్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని స్వయం సహాయక సంఘాల్లో సుమారు 3.40 లక్షల మంది సభ్యులు కొనసాగుతున్నారని, సీసీలు, వీవోఏల సహాయంతో ప్రతి ఎస్‌హెచ్‌జీ సభ్యుల విద్యా సంబంధిత వివరాలను సేకరించి ఇందూరు అక్షరలక్ష్మి యాప్‌లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. అక్షరాస్యతా కేంద్రాలను ఏర్పాటు చేసి వలంటీర్ల ద్వారా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దుతారని, అదేవిధంగా పదో తరగతి లోపు చదువుకున్న వారిని ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి పరీక్షలు రాయించడం, ఎస్సెస్సీ ఉత్తీర్ణులైన వారిని ఓపెన్ ఇంటర్ పరీక్షలు రాయించడం జరుగుతుందని తెలిపారు. గణాంకాల ప్రకారం జిల్లాలో మహిళల అక్షరాస్యత 55 శాతంగా ఉందని, సంపూర్ణ అక్షరాస్యత కార్యక్రమం అమలు ద్వారా నూటికి నూరు శాతం మహిళా అక్షరాస్యత సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. సంపూర్ణ అక్షరాస్యత సాధన కోసం పూర్తి సహకారమందిస్తామన్నారు. డీఆర్డీవో సాయాగౌడ్, ఏపీడీ రవీందర్, డీఈవో అశోక్, డీడబ్ల్యూవో రసూల్ బీ, డీఎంహెచ్‌వో రాజశ్రీ, వయోజన విద్యా సంయుక్త సంచాలకులు గోవింద్‌రావు, స్వయం సహాయక మహిళా సమాఖ్య ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోహిణిలో ఆరుద్ర



'రోహిణి కార్తె ఎండలకు రోళ్లు పగులుతాయి.. మృగశిరలో ముల్లోకాలు చల్లబడతాయి.. ఆరుద్రలో అడ్డెడు చల్లితే పుట్టెడు పండుతాయి..' అని అన్నదాతలు సామెతలు చెప్పుకుంటారు. ఆ సామెతల్లో చెప్పిన విధంగానే ఆయా కార్తెల్లో వాతావరణ పరిస్థితులను చూస్తుంటాం. కానీ ఈ ఏడాది మాత్రం రోహిణి కార్తె ప్రారంభంలోనే 'ఆరుద్ర' పురుగులు కనువిందు చేస్తున్నాయి. సాగు పనులు ప్రారంభించేందుకు అనుకూలమైన ఆరుద్ర కార్తెలో ఈ పురుగులు కనిపిస్తే వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని రైతులు నమ్ముతారు. వ్యవసాయ భూములు, మైదాన ప్రాంతాల్లో ఆరుద్ర పురుగులు కనువిందు చేస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. – ఆర్మూర్

క్లుప్తంగా

రాహుల్ గాంధీని కలిసిన పీసీసీ చీఫ్


రాహుల్‌గాంధీతో పీసీసీ చీఫ్ కుటుంబం

నిజామాబాద్ సిటీ: కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీని టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ కలిశారు. ఢిల్లీలోని తన నివాసంలో పీసీసీ చీఫ్ కుటుంబసమేతంగా సోమవారం కలిసి రాహుల్‌గాంధీని సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, పార్టీ కార్యక్రమాలను రాహుల్ గాంధీకి వివరించారు.

డిగ్రీ పరీక్షల్లో ముగ్గురు డిబార్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షల్లో సోమవారం మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతూ ముగ్గురు విద్యార్థులు డిబార్ అయినట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పరిధిలో ఏర్పాటు చేసిన 32 పరీక్ష కేంద్రాల్లో 9,793 మంది విద్యార్థులకు 9,023 మంది హాజరు కాగా 770 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. నిజామాబాద్ నగరంలోని కేర్ డిగ్రీ కళాశాలలో ఒకరు, సీఎస్ఐ డిగ్రీ కళాశాలలో ఒకరు, ఆర్మూర్‌లోని నరేంద్ర డిగ్రీ కళాశాలలో ఒక విద్యార్థి డిబార్ అయ్యారని తెలిపారు. ఉదయం జరిగిన 6వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షకు 5,852 మంది విద్యార్థులకు 5,457 మంది హాజరు కాగా 395 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. మధ్యాహ్నం జరిగిన 1వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలకు 3,941 మంది విద్యార్థులకు 3,566 మంది హాజరుకాగా 375 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

ట్రాఫిక్ ఏసీపీకి సన్మానం


ఏసీపీని సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

ఖలీల్‌వాడి: ట్రాఫిక్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన మస్తాన్ అలీని నిజామాబాద్ మానవ హక్కుల కమిటీ జిల్లా అధ్యక్షుడు మాల్వేకర్ ధర్మేంద్ర సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర మాట్లాడుతూ మస్తాన్ అలీ గతంలో నగరంలోని మహిళా పోలీస్‌స్టేషన్‌లో సీఐగా విధులు నిర్వర్తిస్తూ రెండు లాక్‌డౌన్ల సమయంలో ప్రజల మన్ననలు పొందారని గుర్తు చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు చంద్రశేఖర్, నరేందర్, షేక్ గౌస్, ఫైజాన్, జే లక్ష్మణ్, రాజేశ్వర్, రఫీక్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌వో వెంకటరమణ సస్పెన్షన్

- పూర్తిస్థాయి విచారణకు ఆదేశాలు

సాక్షి ఎఫెక్ట్..

నిజామాబాద్‌నాగారం: 'విధులకు డుమ్మా.. రిజిస్టర్‌లో సంతకాలు' అనే శీర్షికన ఈ నెల 16న 'సాక్షి'లో ప్రచురితమైన కథనం జిల్లా, రాష్ట్ర వైద్యారోగ్యశాఖలో సంచలనం రేపిన విషయం తెలిసిందే. దీంతో రాష్ట్ర అడ్మినిస్ట్రేటీవ్ అధికారి శశి సిరికొండ పీహెచ్‌సీని తనిఖీ చేసిన విషయం తెలిసిందే. కాగా, ప్రాథమిక విచారణ ఆధారంగా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశాల మేరకు సిరికొండ పీహెచ్‌సీలో విధులకు డుమ్మా కొడుతున్న సీహెచ్‌వో వెంకటరమణను డీఎంహెచ్‌వో డాక్టర్ బద్దం రాజశ్రీ సస్పెన్షన్ చేశారు. మరోవైపు సిరికొండ పీహెచ్‌సీలో అసలేం జరిగిందో తెలుసుకునేందుకు వర్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజును విచారణ అధికారిగా నియమించారు. సమగ్ర విచారణ అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో తెలిపారు.

అపార్ట్‌మెంట్లో అగ్ని ప్రమాదం

ఖలీల్‌వాడి: నగరంలోని కంఠేశ్వర్ బైపాస్‌లోని జీఎస్ఆర్ అపార్ట్‌మెంట్‌లో సోమవారం రాత్రి షార్ట్ సర్క్యూట్ తో మంటలు చెలరేగాయి. వెంటనే అపార్ట్‌మెంట్ వాసులు ఫైర్ ఇంజన్‌కు సమాచారం ఇవ్వగా వచ్చి మంటలను ఆర్పివేశారు. ఎలాంటి ఆస్తి నష్టం జరగలేదని, సెల్లార్‌లో మంటలు చెలరేగడంతో ఆర్పివేసినట్లు ఫైర్ ఆఫీసర్ శంకర్ తెలిపారు.

ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- ప్రజావాణికి 106 వినతులు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు

నిజామాబాద్ అర్బన్: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 106 ఫిర్యాదులు అందాయి.

జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డీపీవో శ్రీనివాస్, ఏసీపీలు రాజావెంకట్ రెడ్డి, శ్రీనివాస్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

కొనుగోళ్లలో జాప్యంపై చర్యలు తీసుకోవాలి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్, రైతులు

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరుగుతోందని వెంటనే చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులచారి దినేశ్ పేర్కొన్నారు. ఈ మేరకు ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇప్పటి వరకు అధికారులు 8.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినప్పటికీ ఇంకా 3.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కల్లాల్లో ఉందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని,ఇప్పటికైనా కొనుగోళ్లు వేగంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు.

గురుకులాల మూసివేత విరమించుకోవాలి

రాష్ట్ర వ్యాప్తంగా 12 సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల మూసివేతను విరమించుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి గణేశ్ ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. 1985 నుంచి నేటి వరకు ఇంగ్లిష్ మీడియంలో దళిత విద్యార్థులకు విద్యను బోధిస్తూ ఎన్నో అవకాశాలను అందించాయన్నారు. కానీ, ప్రస్తుత ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 12 గురుకులాల మూసివేతపై నిర్ణయం తీసుకోవడం సరైంది కాదన్నారు.


అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

అనుమతి లేకుండా అడ్మిషన్లు చేస్తున్నారని..


అదనపు కలెక్టర్ అంకిత్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

నగరంలోని కంఠేశ్వర్ బైపాస్ రోడ్డులో ఉన్న శ్రీ చైతన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. అంతకుముందు శ్రీ చైతన్య పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. నూతనంగా నిర్మిస్తున్న భవనంలో ఎలాంటి అనుమతులు లేకుండా అడ్మిషన్లు చేపడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు అంజలి, కుషాల్, కార్తీక్, నవీన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కూలిన చారిత్రక కట్టడం


కూలకముందు ఏడంతస్తుల భవనం (ఫైల్)


కూలిన తర్వాత..

నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండలం కుద్వాన్‌పూర్ గ్రామంలో నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు చారిత్రక కట్టడమైన ఏడంతస్తుల భవనం కూలిపోయింది. ఆదివారం రాత్రి 10.30 గంటలకు పెద్ద శబ్దం రావడంతో గ్రామస్తులు వెళ్లి చూడగా భవనం కుప్పకూలింది. ఘటన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని గ్రామస్తులు, కుటుంబీకులు ఊపిరి పీల్చుకున్నారు. తమకు పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చిన భవనం కూలిపోవడం బాధగా ఉందని ఉత్తూర్ లచ్చయ్య మనుమడు పాలకుర్తి శ్రీనివాస్ ఆవేదనను వ్యక్తం చేశాడు.

1942లో నిర్మాణం..

కుద్వాన్‌పూర్ నిజాం కాలంలో ఆస్థానంగా ఉండేది. గ్రామానికి చెందిన ఉత్తూర్ లచ్చయ్య వృత్తి రీత్యా ప్రజలకు వైద్యం చేసేవాడు. కాగా, తనకు ఉండే భవనం మరెవరికీ ఉండొద్దని ఉద్దేశంతో 1942 సంవత్సరంలో ఏడంతస్తులు నిర్మించాడు. అప్పట్లోనే హైదరాబాద్ సంస్థానం నుంచి అనుమతి పొందినట్లు సమాచారం. సొంతంగా కట్టడం ప్లాన్ చేసుకొని, డంగు సున్నాన్ని ఎడ్లతో తొక్కించి సిమెంట్‌లా తయారు చేసి ఇంటిని నిర్మించినట్లు కుటుంబీకులు తెలిపారు. జిల్లాలో ఏడంతస్తుల భవనం ఎక్కడా లేకపోవడంతో అప్పట్లో ఈ భవనాన్ని చూసేందుకు తరలివచ్చేవారని చెపుతారు. కాలక్రమేనా లచ్చయ్య ఇష్టంతో కట్టుకున్న ఈ భవనాన్ని కూతురు ప్రభావతికి ఇచ్చిన కొన్ని రోజులకు కన్నుమూశాడు. కాగా, ప్రభావతి తన కుటుంబంతో ఇదే భవంతిలో నివాసం ఉండేది. కుమారులు ఇతర ప్రాంతాలకు వెళ్లగా గత పది సంవత్సరాల నుంచి ఈ భవనాన్ని అద్దెకు ఇచ్చారు. నెల రోజుల క్రితం వరకు ఈ భవనంలో జనాలు నివసించినట్లు గ్రామస్తులు తెలిపారు.

పూర్వ విద్యార్థులకు ఉచిత శిక్షణ

ఆర్మూర్‌టౌన్: డిగ్రీ పూర్తి చేసి 25 సంవత్సరాల్లోపు గురుకుల పూర్వ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఆర్మూర్ పట్టణంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ చంద్రిక ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నతి ఫౌండేషన్, గురుకుల సొసైటీ సంయుక్తంగా శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. శిక్షణలో స్పోకెన్ ఇంగ్లిష్, జీవిత నైపుణ్యాలు, మానవీయ విలువలు, కంప్యూటర్ పరిజ్ఞానం, వృత్తి శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. అర్హులైన వారు ఈ నెల 30లోపు ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

తల్లి చేపల కోసం తంటాలు

- మత్స్య సహకార సంఘాలను ఆశ్రయిస్తున్న అధికారులు
- బదులుగా చేప పిల్లలు, నగదు ఇస్తామంటూ..


ఇందల్వాయి చెరువులో అధికారులు పరిశీలించిన తల్లి చేపలు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ దిగువన ఉన్న జాతీయ చేపపిల్లల ఉత్పత్తి కేంద్రంలో చేపపిల్లల ఉత్పత్తి కోసం అధికారులు నానా తంటాలు పడుతున్నారు. ఇప్పటికే తల్లి చేపలను తీసుకొచ్చి పాండ్లలో వేయాల్సింది. కానీ, నిధులు లేకపోవడంతో తల్లి చేపల సేకరణ చేపట్టలేదు. దీంతో అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకున్నట్లు తెలిసింది. తల్లి చేపలను పట్టిస్తే.. బదులుగా చేప పిల్లలను పంపిణీ చేస్తామని జిల్లాలోని పాతంగల్, అమ్దాపూర్, కంజర, ఇందల్వాయి మత్స్యసహకార సంఘాల వద్ద బేరసారాలు చేసినట్లు సమాచారం. ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసే చేప పిల్లలు కాకుండా అదనంగా చేప పిల్లలను సరఫరా చేస్తామని, అంతే కాకుండా 25 శాతం నగదు ఇస్తామని అధికారులు చెపుతున్నట్లు తెలిసింది. కాగా, గతంలో ఇదే చేపపిల్లల ఉత్పత్తి కేంద్రంలో పనిచేసిన అధికారులు మత్స్య సహకార సంఘాలకు డోకా ఇవ్వడంతో ప్రస్తుతం అధికారులు ఎన్ని చెప్పినా వారు నమ్మడం లేదు. మరోవైపు తక్కువ ధరకు తల్లి చేపలను ఇవ్వాలని అధికారులు కోరుతుండడంతో మత్స్యకారులు ముందుకు రావడం లేదు. ప్రభుత్వం చెల్లించే ధర కిలో తల్లి చేపలకు రూ.100 ఇస్తామని అధికారులు చెపుతుండగా, మత్స్యకారులు రూ.150 కి విక్రయిస్తామని తేల్చి చెబుతున్నట్లు సమాచారం. గతేడాది సైతం చివరి వరకు నిర్లక్ష్యం చేసి తూతు మంత్రంగా లక్ష పిల్లలు ఉత్పత్తి చేసి చేతులు దులుపుకున్నారు. ప్రస్తుతం కూడా చేపపిల్లల ఉత్పత్తి అనుమానంగానే కనిపిస్తుంది. ఇదే విషయమై మత్స్యశాఖ ఏడీ ఆంజనేయులును 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.

ఏపీఆర్ఏసీఏ సమావేశంలో డీసీసీబీ చైర్మన్



బాలిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్ రెడ్డి

సుభాష్‌నగర్: ఇండోనేషియా దేశంలోని బాలిలో సోమవారం ప్రారంభమైన 78వ ఆసియా పసిఫిక్ రూరల్ అగ్రికల్చరల్ క్రెడిట్ అసోసియేషన్ (ఏపీఆర్ఏసీఏ) సమావేశంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ కుంట రమేశ్ రెడ్డి పాల్గొన్నారు. మొదటిరోజు సమావేశంలో సహకార రంగ అభివృద్ధిపై చర్చించారని, మూడు రోజులపాటు సమావేశాలు కొనసాగుతాయని తెలిపారు. తెలంగాణలో డీసీసీబీల ద్వారా రైతులకు అందిస్తున్న సేవలు, పనితీరు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారం, ఉద్యోగులు, పాలకవర్గం, తదితర అంశాలపై రమేశ్‌రెడ్డి సమావేశంలో వివరించారు. ఈ సమావేశానికి భారత్ తరఫున 10 మంది ప్రతినిధులు పాల్గొనగా, అందులో తెలంగాణ నుంచి ఐదుగురు ఉన్నారు.

బస్సుల ఫిట్‌నెస్ బాధ్యత స్కూల్ యాజమాన్యాలదే

- రాష్ట్ర రోడ్డు రవాణా సంయుక్త కమిషనర్ చంద్రశేఖర్‌గౌడ్


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర రోడ్డు రవాణా సంయుక్త కమిషనర్ చంద్రశేఖర్‌గౌడ్

ఖలీల్‌వాడి: స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించాలని, బస్సుల్లో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యాలదేనని రాష్ట్ర రోడ్డు రవాణా సంయుక్త కమిషనర్ చంద్రశేఖర్‌గౌడ్ పేర్కొన్నారు. నాగారంలోని జిల్లా రోడ్డు రవాణా శాఖ కార్యాలయంలో స్కూల్, కాలేజీ బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. యాజమాన్యాలు బస్సులను సరిగా పట్టించుకోకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. కొత్తగా వచ్చిన డ్రైవర్లకు రూట్లు తెలియకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని చెప్పారు. పీపీ–1 నుంచి ఆరో తరగతి వరకు చదివే పిల్లలు స్కూల్‌కు వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు తల్లిదండ్రులు లేదా కుటుంబసభ్యులు బస్సుల వద్ద వేచి ఉండి తమ వెంట తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో డీటీసీ పరిమళ, డీటీవో ఉమామహేశ్వర్‌రావు, రోడ్డు రవాణా సభ్యులు రాజరాజనరేందర్, ఏంవీఐలు వివేకానందరెడ్డి, కిరణ్, రాహుల్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలి


మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ శ్వేత

నందిపేట్ (ఆర్మూర్): అధిక రసాయనిక ఎరువుల వాడకంతో నేల పరిరక్షణ తగ్గుతుందని, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ శ్వేత సూచించారు. 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో భాగంగా సోమవారం నందిపేట మండలం తల్వేద గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. శాస్త్రవేత్త డాక్టర్ శ్వేత మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులు సాగుచేసి భూమిలో కలియ దున్నడంతో పంటలో వేసే యూరియా శాతాన్ని తగ్గించుకోవచ్చని సూచించారు. శాస్త్రవేత్త విజయ్ కుమార్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు ప్రైవేట్ రకాలకు దీటుగా కూనారం 1638, వరంగల్ సిద్ధి, డబ్ల్యూజీఎల్ 1119, రుద్రూరు నుంచి విడుదలైన ఆర్‌డీఆర్ 1200, ఆర్‌డీఆర్ 1162, ఆర్ఎన్ఆర్ 15048 వరి వంగడాలను వివరించారు. సోయాబీన్ సాగుకు బాసర రకం, కేడీఎస్ రకాలు, వాటి గుణగణాలను పేర్కొన్నారు. ఆర్మూర్ డివిజన్ ఏడీఏ విజయలక్ష్మి మాట్లాడుతూ కాంప్లెక్స్ ఎరువులని పైపాటుగా వేయొద్దని, దుక్కిలో మాత్రమే వేసుకోవాన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి జ్యోత్స్న భవాని, పీఏసీఎస్ చైర్మన్ చిన్న గంగారెడ్డి రెడ్డి, విజయ్ కుమార్, సంధ్య, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు చోట్ల విద్యుత్ షాక్‌తో ఇద్దరి మృతి


మహ్మద్ అజీజ్ (ఫైల్)

లింగంపేట (ఎల్లారెడ్డి): విద్యుత్ షాక్‌తో ఒకరు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన మహ్మద్ అజీజ్(33) నాలుగు సంవత్సరాలుగా లింగంపేటలో వెల్డింగ్ షాపు నడుపుకుంటూ జీవిస్తున్నాడు. సోమవారం ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగలడంతో స్పృహ కోల్పోయాడు. స్థానికులు ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడికి భార్య అమ్రిన్ బేగం, కూతురు మదియా ఫాతిమా, కుమారులు మహ్మద్ అజాన్, మహ్మద్ దయాన్ ఉన్నారు.

గురుకుల అవుట్‌సోర్సింగ్ వాచ్‌మన్..


లింగం (ఫైల్)

భిక్కనూరు: మండల కేంద్ర సమీపంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సోమవారం కరెంట్ షాక్‌తో అవుట్‌సోర్సింగ్ వాచ్‌మన్ మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. గురుకుల కళాశాలలో జూన్ ఒకటో తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతున్న నేపథ్యంలో సొసైటీ ఉన్నతాధికారులు తరగతి గదులు, పరిసరాలు, వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేయాలని ఆదేశించారు. దీంతో అవుట్ సోర్సింగ్ వాచ్‌మన్లు దోమకొండ లింగం(35), భాస్కర్, ఎలక్ట్రీషియన్ ఆరోజ్ ఆవరణలో ఉన్న వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేసేందుకు సిద్ధమయ్యారు. లింగం, ఆరోజ్ ట్యాంక్‌పైకి ఎక్కగా భాస్కర్ కింద ఉన్నాడు. ట్యాంక్‌లోకి దిగేందుకు నిచ్చెన అవసరం ఉండడంతో భాస్కర్ ఇనుపనిచ్చెనను ట్యాంక్‌పైన ఉన్న లింగంకు అందించాడు. లింగం నిచ్చెనను పైకిలేపగా పైన ఉన్న విద్యుత్ తీగలకు తగలడంతో విద్యుత్‌షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆరోజ్ తలకు తీవ్రగాయం కాగా ఆస్పత్రికి తరలించారు. ఎస్సై ఆంజనేయులు ఘటనా స్థలానికి చేరుకొని లింగం మృతదేహాన్ని కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య రాజేశ్వరి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఘటనా స్థలాన్ని ఆర్డీవో వీణ, డిప్యూటీ తహసీల్దార్ శృతి, ఆర్ఐ బాలయ్య సందర్శించారు.

తండ్రి హత్య కేసులో కొడుకు రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రవీందర్‌నాయక్

లింగంపేట(ఎల్లారెడ్డి): తండ్రిని హత్య చేసిన కొడుకును రిమాండ్‌కు తరలించినట్లు ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మండలంలోని అయ్యపల్లి తండాకు చెందిన దేవసోత్ ఫకీరా భార్య, పిల్లలు ఉండగా రెండో వివాహం చేసుకోవడానికి సిద్ధమయ్యాడు. ఫకీరా ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు తెలుపగా వారు నిరాకరించారు. తండ్రి రెండో పెళ్లి చేసుకోవడం ఇష్టంలేని కొడుకు దేవసోత్ ప్రకాశ్.. ఫకీరాను గొడ్డలితో నరికి చంపినట్లు తెలిపారు. ఫకీరా సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. సమావేశంలో ప్రొహిబిషన్ ఎస్సై రాఘవేంద్ర, ఏఎస్సై ప్రకాశ్ నాయక్, సిబ్బంది మదన్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిగారింటికి వస్తూ అనంతలోకాలు..


సులోచన (ఫైల్)

మాచారెడ్డి : తల్లిగారింటికి వస్తున్న ఓ గృహిణి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన మాచారెడ్డి మండలం లచ్చాపేట గ్రామ శివారులో చోటుచేసుకుంది. ఐదు నిమిషాల్లో ఇల్లు చేరుతుందనగా మృత్యువు కబళించడంతో విషాదఛాయలు అలుముకున్నాయి. ఎస్సై అనిల్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా రాజన్నపేట గ్రామానికి చెందిన సులోచన (36) సోమవారం ఇద్దరు కుమారులు అన్వేష్, శివాన్స్‌లతో కలిసి బస్సులో వచ్చి మాచారెడ్డి చౌరస్తాలో దిగింది. తండ్రి నారాయణకు ఫోన్ ద్వారా సమాచారం అందించింది. దీంతో నారాయణ తన టీవీఎస్ మోపెడ్‌పై ఇద్దరు మనుమలు, కూతురు సులోచనను తీసుకొని లచ్చాపేట గ్రామానికి వెళుతుండగా స్టేజీ సమీపంలో వెనుక నుంచి వచ్చిన బైకు ఢీకొట్టింది. తీవ్రగాయాలైన సులోచనను కామారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. తండ్రి నారాయణ, ఇద్దరు కుమారులు చికిత్స పొందుతున్నారు. కాగా, సులోచన భర్త మహేందర్ బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశానికి వెళ్లాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు..

నందిపేట్ (ఆర్మూర్): రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన నిర్మల్ జిల్లాకు చెందిన జాదవ్ సుందాబాయి(70) చికిత్స పొందుతూ మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. నిర్మల్ జిల్లా కుంటాల మండలం దొనెల్లి తాండకు చెందిన రాథోడ్ సంతోష్ తల్లి రాథోడ్ యమునాబాయి ఆరోగ్యం బాగోలేదని అత్తమ్మ జాదవ్ సుందబాయితో కలిసి సోమవారం ఆర్మూర్ మండలం ఆలూరు గ్రామానికి డాక్టర్ వద్దకు ఆటోలో వస్తున్నారు. నందిపేట మండలం వెల్మల్ గ్రామ సమీపంలో ఎదురుగా బైక్ పై అతి వేగంగా వచ్చిన పెద్ద అంజన్న ఆటోని ఢీకొట్టాడు. ఆటోలో ఉన్న ఇద్దరికి గాయాలుకావడంతో నిజామాబాద్ జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. కాగా, చికిత్స పొందుతూ జాదవ్ సుందబాయి మృతి చెందింది. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

రామాయంపేట్‌లో రోడ్డు ప్రమాదం

- ఒకరి మృతి, మరొకరి పరిస్థితి విషమం
- ఖిల్లా డిచ్‌పల్లిలో విషాదం


నిఖిల్ (ఫైల్)

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): వారిద్దరూ చిన్నప్పటి నుంచి కలిసే చదువుకున్నారు. బీటెక్ పూర్తి చేసి హైదరాబాద్‌లోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగాల్లో చేరారు. వారాంతపు సెలవుల్లో కలిసే గ్రామానికి వచ్చి రెండు రోజులపాటు కుటుంబసభ్యులు, మిత్రులతో సంతోషంగా గడిపి తిరిగి ఉద్యోగానికి వెళుతుంటారు. అలాంటిది సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదం వారి జీవితంతోపాటు గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ప్రమాదంలో ఒక యువకుడు అక్కకడికక్కడే మృతి చెందగా మరో యువకుడు తీవ్రగాయాలపాలై ఆస్పత్రిలో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఖిల్లా డిచ్‌పల్లి గ్రామానికి చెందిన బూస లింబాద్రి, లక్ష్మి దంపతులు కొడుకు నిఖిల్ (24), మల్లాపురం నర్సయ్య, సునీత దంపతుల కొడుకు నితీశ్ మంచి స్నేహితులు. ప్రస్తుతం హైదరాబాద్ మాదాపూర్‌లోని అర్కబ్రాంకమ్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్నారు. శని, ఆదివారం వీకెండ్ సెలవుల్లో భాగంగా గ్రామానికి వచ్చారు. తిరిగి సోమవారం ఉదయం 6 గంటలకు ఇద్దరూ కలిసి మోటార్ బైక్‌పై హైదరాబాద్‌కు బయలుదేరారు. మెదక్ జిల్లా రామాయంపేట బైపాస్ క్రాసింగ్ వద్ద 44వ నెంబర్ జాతీయ రహదారిపై వీరి బైక్‌ను వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టి ఆపకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో నిఖిల్ అక్కడిక్కడే మృతి చెందగా నితీశ్ తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకొని రామాయంపేట్‌కు చేరుకున్న కుటుంబసభ్యులు నితీశ్‌ను సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం నితీశ్ పరిస్థితి విషమంగా ఉంది. అందరితో కలిసి మెలిసి ఉండే నిఖిల్ రోడ్డు ప్రమాదంలో చనిపోవడం, నితీశ్ తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చేరడంతో ఖిల్లా డిచ్‌పల్లి గ్రామంలో తీవ్ర విషాదం నింపింది. సాయంత్రానికి గ్రామానికి చేరుకున్న నిఖిల్ మృతదేహానికి తల్లిదండ్రులు, బంధుమిత్రులు, గ్రామస్తులు కన్నీళ్లతో అంత్యక్రియలు నిర్వహించారు.

వేర్వేరు కేసుల్లో పలువురికి జైలు

ఖలీల్‌వాడి: మద్యం తాగి వాహనాలు నడిపిన 36 మందిని ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ ఆదేశాల మేరకు సోమవారం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ ఎదుట హాజరుపర్చినట్లు ట్రాఫిక్ సీఐ ప్రసాద్ తెలిపారు. 31 మందికి రూ.59వేల జరిమానా విధించగా, ఒకరికి ఒకరోజు, నలుగురికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు పేర్కొన్నారు.

పది మందికి రెండు రోజులు..

ఆర్మూర్ టౌన్: పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన పది మందికి కోర్టు జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వారిని సోమవారం కోర్టులో హాజరుపర్చగా పదిమందికి రెండు రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ ఆర్మూర్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గట్టు గంగాధర్ తీర్పునిచ్చినట్లు తెలిపారు. పేర్కొన్నారు.

అర్ధరాత్రి వరకు షాపు తెరిచిన ముగ్గురికి..

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి వరకు షాపులు తెరిచిన ముగ్గురికి ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి సోమవారం తెలిపారు. వీక్లీ మార్కెట్‌లో చింతకాయల రాజేందర్, బోధన్ రోడ్డులో గుండె రాజు, మాలపల్లి ఫ్రూట్ మార్కెట్‌లో షేక్ అర్బాజ్‌లను స్పెషల్ సెకండ్‌క్లాస్ జడ్జి ఎదుట హాజరుపరచగా ముగ్గురికి జైలు శిక్ష విధించినట్లు పేర్కొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన ఒకరికి..

ఖలీల్‌వాడి: నగరంలోని కంఠేశ్వర్ మీసేవ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా విధులకు ఆటంకం కలిగించిన చిలం గౌతంరెడ్డిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు మూడో టౌన్ ఎస్సై హరిబాబు సోమవారం తెలిపారు. ఆదివారం సాయంత్రం గౌతంరెడ్డి మద్యం సేవించి వాహనాన్ని అతివేగంగా నడుపుతూ రాగా ట్రాఫిక్ పోలీసులు ఆపి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్ష చేస్తుండగా దాడి చేసి విధులకు ఆటంకపరిచాడు. ట్రాఫిక్ పోలీసుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.